సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం । 26 । నవంబర్ । 2024



ఆశలు సమాధి చేస్తూ..

పింఛన్లపై కూటమి కుట్రలు చేస్తోంది. కొత్త పింఛన్ల విషయంలో స్పష్టత కరువైంది.

- 8లో



అనుమానాస్పద మృతి

పలాస మండలంలో ఓ వివాహిత అనుమానాస్పద రీతిలో మృతి చెందింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

- 8లో

ఇంజినీరింగ్ 5, 7 సెమిస్టర్ల పరీక్ష ఫీజు చెల్లింపునకు నోటిఫికేషన్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో బీటెక్ చదువుతున్న 5, 7 సెమిస్టర్ విద్యార్థులు డిసెంబర్ 2వ తేదీలోపు పరీక్ష ఫీజులు చెల్లించాలని ఎగ్జామినేషన్స్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ సోమవారం చెప్పారు. ఈ మేరకు పరీక్షల నిర్వహణ నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.30, పరీక్ష ఫీజు రూ. 770, ప్రాక్టికల్ ఫీజు రూ. 250 మొత్తం రూ. 1050 చెల్లించాల్సి ఉంటుందని అన్నారు.

న్యూస్‌రీల్

నిర్వాసితులపై కేసు కొట్టివేత



కొత్తూరు: వంశధార నిర్వాసితులపై 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పెట్టిన తప్పుడు కేసులను స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సోమవారం కొట్టి వేసినట్లు నిర్వాసితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గంగరాపు సింహాచలం ఓ ప్రకటనలో తెలిపారు. వంశధార నిర్వాసితులకు ప్రభుత్వ నుంచి రావాల్సిన పునరావాస ప్యాకేజీలు చెల్లించాలంటూ మండలంలోని ఇరపాడు గ్రామంలో సమావేశం జరిగింది. సమావేశంలో 144 సెక్షన్ ఉల్లంఘించినట్లు గంగరాపు సింహాచలంతో పాటు బొంతల నారాయణరావు, మోజూరు అప్పడు, వాలిపిల్లి సింహచలం, ఆలికాన ఆనందరావులు పై కొత్తూరు పోలీసులు కేసు నమోదు చేశారు. సుమారు ఎనిమిదేళ్ల పాటు జరిగిన విచారణ అనంతరం స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కె.రాణి కేసులు కొట్టేస్తూ తీర్పునిచ్చారని కేసు వాదించిన న్యాయవాది ఎం. అప్పారావు చెప్పారు.

జియోట్యాగ్ అయిన వాహనాలతో మాత్రమే రవాణా



టెక్కలిపాడు మిల్లు వద్ద అధికారులు, రైతులతో మాట్లాడుతున్న జేసీ

జలుమూరు: రైతులు విక్రయించే ధాన్యం బస్తాలను ఆయా మిల్లులకు జియో ట్యాగ్ అయిన వాహనాలతో మాత్రమే రవాణా చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. సోమవారం టెక్కలిపాడు రైస్ మిల్లును తనిఖీ చేసి రైతులతో మాట్లాడారు. ప్రధానంగా బ్యాంక్ గ్యారెంటీలు చూసుకోవాలన్నారు. ట్రక్ షీట్ జనరేట్ అయిన వారం రోజుల్లో అమ్మకాల ప్రక్రియ పూర్తవ్వాలన్నారు. ఆయా రైతు సేవా కేంద్రాల నుంచి షెడ్యూల్ విధిగా తీసుకోవాలన్నారు. ఆయనతోపాటు తహసీల్దార్ జెన్ని రామారావు, సీఎస్‌డీటీ షరీఫ్, ఆర్ఐ కిరణ్ సిబ్బంది ఉన్నారు.





శ్రీకాకుళంలోని ఎగ్జిబిషన్ మైదానంలో కోటి దీపాల వెలుగులు (ఇన్‌సెట్లో) దీపాలు వెలిగిస్తున్న మహిళలు



శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని బొడెమ్మ కోవెలలో శివలింగానికి రుద్రాక్షలతో అలంకరణ



జలుమూరు: శ్రీముఖలింగం ఆలయంలో భక్తుల సందడి

తత్ప్రణమామి సదాశివ లింగం

కార్తీకాన ప్రతి క్షేత్రం కైలాసాన్ని తలపించింది. ఈశుని దర్శనానికి నిదర్శనంగా నుదుట విభూది రేఖ మెరిసింది. పంచాక్షరి పలించిన గొంతు తులసి తీర్థంతో పావనమైంది. భక్తితో జోడించిన చేతికి ఓ మారేడు దీవెనగా దక్కింది. వరుసలో నిలుచున్న భక్తుడికి లింగాష్టకం వినే భాగ్యం దక్కింది. నాలుగు వారాల పాటు ఊరూరా జరిగిన ఆధ్యాత్మిక జాతర ఓ ముగింపునకు వచ్చింది. కార్తీక మాసంలో చివరి సోమవారం నాడు శైవ క్షేత్రాలన్నీ భక్తులతో పోటెత్తాయి. అభిషేకాలు, అర్చనలు, ధూప దీప నైవేద్యాలతో కోవెలలు కళకళలాడాయి.



టెక్కలి మండలం రావివలస మల్లన్న సన్నిధిలో పోటెత్తిన భక్తజనం

రెండు కన్నులా.. కోటి దీపాల వెన్నెల



జిల్లా కేంద్రంలోని పీఎస్ఎన్ఎం హైస్కూల్ వెనుక ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో సోమవారం సాయంత్రం కోటి దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. పుణ్యపువీధిలోని సీతారామచంద్రమూర్తి సహిత సువర్చలా అభయాంజనేయస్వామి ఆలయం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉత్సవంలో పాల్గొన్న వారికి 365 వత్తులతో కట్టవత్తులను, 30వేల ప్రమిదలను అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు హరిసూర్యప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో 108 శివలింగాలకు 108 మంది దంపతులతో సామూహిక మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి ఫణికుమార్, ఆలయ ధర్మకర్త ముక్కాల కొండబాబు, ఎమ్మెల్యే గొండు శంకర్, దానేటి శ్రీధర్, నటుకుల మోహన్, సుంకరి కృష్ణకుమార్, యం.రామనారాయణరావు, వేణుమాస్టార్ తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకాకుళం కల్చరల్



శ్రీకాకుళంలో శివుడికి ప్రత్యేక అలంకరణ

ముగిసిన ఆరాట్టు బ్రహ్మోత్సవాలు

జిల్లా కేంద్రంలోని బలగ అయ్యప్పస్వామి ఆరాట్టు బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఆలయ కమిటీ, అర్చకుల ఆధ్వర్యంలో కేరళ సంప్రదాయ పద్ధతిలో ఉత్సవాలను పది రోజుల పాటు నిర్వహించారు. ముగింపు రోజున ఆలయ అర్చకులు దేవరకొండ శంకరనారాయణ ఆధ్వర్యంలో స్వామిని భక్తులు ఊరేగింపుగా నాగావళి నదిలో శ్రీమణికంఠ ఘాట్ వద్దకు తీసుకెళ్లి క్రతువులు నిర్వహించారు. అనంతరం అక్కడ అభిషేకాలు, అర్చనలు, పూజలు చేశారు. ఉత్సవాలను దిగ్విజయంగా నిర్వహించినందుకు కమిటీ సభ్యులు అర్చకులు శంకరనారాయణశర్మ, అర్చక బృందాన్ని పట్టు వస్త్రాలతో సత్కరించారు



నది ఒడ్డున అభిషేకాలు నిర్వహిస్తున్న స్వాములు

వన భోజనం - జన రంజనం



జి.సిగడాం-పాగిరి గ్రామాల మధ్య వన భోజనాలు చేస్తున్న భక్తులు



కేఎల్ రాహుల్ క్లాసిక్ షాట్లను దగ్గరుండి చూడొచ్చు. మిచెల్ స్టార్క్ బులెట్ యార్కర్ల గుట్టు తెలుసుకోవచ్చు. హ్యారీ బ్రూక్ పరుగుల దాహం వెనుక రహస్యం తెలుసుకోవచ్చు. ఫాఫ్ డూప్లెసిస్ అనుభవాలను తెలుసుకుని పునాదులు పటిష్టం చేసుకోవచ్చు. జిల్లా స్టార్ క్రికెటర్ త్రిపురాన విజయ్‌కు బంగారం లాంటి అవకాశం తలుపు తట్టింది. ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులోకి అడుగుపెట్టబోతున్న విజయ్‌కు అనుభవజ్ఞుల ఆటతీరు మార్గదర్శకం కాబోతోంది. టీమిండియాలోకి ప్రవేశించేందుకు ఇది తొలి అడుగు కానుంది.

విజయ్ దరహాసం

- ఐపీఎల్‌లోకి అడుగుపెట్టిన సిక్కోలు తేజం త్రిపురాన విజయ్
- రూ.30 లక్షలకు కొనుగోలు చేసిన ఢిల్లీ క్యాపిటల్స్
- ఆనందం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు, జిల్లా క్రికెట్ సంఘ పెద్దలు

శ్రీకాకుళం న్యూకాలనీ:

జిల్లా స్టార్ క్రికెటర్ త్రిపురాన విజయ్ ఐపీఎల్‌లో అడుగుపెట్టబోతున్నాడు. రూ.30 లక్షల బేస్ ప్రైజ్‌తో రిజిస్టర్ చేసుకున్న విజయ్‌ను ఢిల్లీ డేర్ క్యాపిటల్స్ జట్టు అదే ధరకు కొనుగోలు చేసింది. సౌదీ అరేబియాలో ఈ ఐపీఎల్ వేలం జరిగింది. వేలంలో డీసీ జట్టు కొనుగోలు చేసిందని తెలిశాక క్రికెట్ తల్లిదండ్రులు, జిల్లా క్రికెట్ సంఘ పెద్దలు పట్టరాని సంతోషం వ్యక్తం చేశారు.

మూడేళ్లుగా నిలకడగా రాణింపు..

విజయ్ పదేళ్లుగా క్రికెట్ ఆడుతున్నా.. గత మూడేళ్లుగా నిలకడ చూపిస్తున్నాడు. ఇటీవల ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి వచ్చిన పిలుపు మేరకు సెలెక్షన్స్ ట్రయల్స్‌లో కూడా పాల్గొన్నాడు. కుచ్‌బిహార్ ట్రోఫీ, విజయ్‌హజారే ట్రోఫీ, సయ్యద్ ముస్తాక్ ఆలీ క్రికెట్ టోర్నీలు, రంజీల్లో రాణించడంతో బీసీసీఐ పెద్దల దృష్టిని ఆకర్షించడంతో ఐపీఎల్ ఎంపిక కచ్చితంగా జరుగుతుందని తల్లిదండ్రులతో పాటు జిల్లా క్రికెట్ సంఘ పెద్దలు ఆశించారు. వారి ఆశలు నిజమయ్యాయి. శ్రీకాకుళం జిల్లా నుంచి ఒక క్రికెటర్ ఐపీఎల్‌కు చేరువ కావడం గర్వంగా ఉందని జిల్లా క్రికెట్ సంఘ అధ్యక్షులు పెద్దలు పుల్లెల శాస్త్రి, కార్యదర్శి హసన్‌రాజా, మెంటార్ ఇలియాస్ మహ్మద్, కోశాధికారి మదీనా శైలానీ సంతోషం వ్యక్తంచేస్తున్నారు. ఇదే స్ఫూర్తితో వచ్చే ఏడాదికి మరో ముగ్గురు నలుగురు క్రికెటర్లను తయారుచేస్తామని వారు చెబుతున్నారు.

జిల్లా నుంచి ఒకే ఒక్కడు..

జిల్లా నుంచి ఐపీఎల్ వరకు వెళ్లిన మొదటి క్రికెటర్‌గా త్రిపురాన విజయ్ గుర్తింపు అందుకున్నాడు. టెక్కలిలోని అయ్యప్పనగర్‌లో నివాసం ఉంటున్న త్రిపురాన వెంకటకృష్ణరాజు, లావణ్యలు విజయ్ తల్లిదండ్రులు. తండ్రి సమాచారశాఖలో ఉద్యోగిగా పనిచేస్తుండగా తల్లి గృహిణి. ప్రస్తుతం విజయ్ టెక్కలిలోని ఓ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. పాఠశాల దశలో క్రికెట్‌పైన మక్కువతో త్రిపురాన విజయ్ 2013–14లో అరంగ్రేటం చేశాడు. అంతర్ జిల్లాల నార్త్‌జోన్ అండర్–14 జట్టుకు ప్రాతినిధ్యం వహించి ఉత్తమ ప్రదర్శనతో రాణించడంతో కడప క్రికెట్ అకాడమీకి ఎంపికయ్యాడు. ముఖ్యంగా టాపార్డర్ బ్యాటింగ్‌తోపాటు ఆఫ్‌స్పిన్ మ్యాజిక్‌తో విశేషంగా ఆకట్టుకుంటూ వస్తున్నాడు.



చాలా గర్వంగా ఉంది..

చాలా గర్వంగా, చెప్పలేనంత ఆనందంగా ఉంది. ఐపీఎల్‌కు ఎంపిక కావాలన్న నా కల సాకారమైంది. ఇటీవల ఢిల్లీ క్యాపిటల్స్ సెలక్షన్ ట్రయల్స్ పాల్గొన్నప్పుడే నమ్మకం కలిగింది. నా బేస్ ప్రైస్ రూ.30లక్షలకు ఢిల్లీ క్యాపిటల్స్ ఎంచుకుంది. ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యానికి, ప్రతినిధులకు థాంక్స్ చెప్పుకుంటున్నాను. అవకాశం లభించిన మ్యాచుల్లో సత్తా చాటేందుకు ప్రయత్నిస్తాను. ఈ నాలుగు నెలలపాటు కఠోర సాధన చేస్తాను. నన్ను నిరంతరం ప్రోత్సహిస్తున్న నా తల్లిదండ్రులకు, జిల్లా క్రికెట్ సంఘం, ఆంధ్రా క్రికెట్ సంఘ పెద్దలకు కృతజ్ఞతలు.

- త్రిపురాన విజయ్

చాలా సంతోషంగా ఉంది



మా కుమారుడు విజయ్ ఐపీఎల్‌కు ఎంపిక కావడం నిజంగా సంతోషంగా ఉంది. తల్లిదండ్రులుగా మేము గర్వపడుతున్నాం. ఐపీఎల్‌లో మ్యాచ్‌లు ఆడే అవకాశం వస్తే తన ప్రతిభను నిరూపించుకునేందుకు సిద్ధంగా ఉన్నాడు. గత దశాబ్ద కాలంగా క్రికెట్టే శ్వాసగా ఉంటున్నాడు. భగవంతుడు శ్రమకు తగిన ఫలితాన్ని అందించాడని నమ్ముతున్నాం.

-వెంకట కృష్ణంరాజు, లావణ్య త్రిపురాన విజయ్ తల్లిదండ్రులు



పూర్తిపేరు	త్రిపురాన విజయ్
వయస్సు	22 ఏళ్లు
తల్లిదండ్రుల పేర్లు	త్రిపురాన వెంకట కృష్ణరాజు, లావణ్య
నివాసం	టెక్కలిలోని అయ్యప్పనగర్
విద్యాభ్యాసం	డిగ్రీ ఫస్టియర్ (టెక్కలి)
బ్యాటింగ్ శైలి	రైట్‌హ్యాండ్ బ్యాటర్
బౌలింగ్ శైలి	రైటార్మ్ ఆఫ్ స్పిన్

ట్రాక్ రికార్డ్

- 2022–23, 2024–25 రెండు సీజన్లలో ప్రతిష్టాత్మక రంజీ పోటీల్లో పాల్గొనే ఆంధ్రా పురుషుల జట్టుకు ఎంపికయ్యాడు.
- అండర్–19 విభాగంలో ఏసీఏ నార్త్‌జోన్ పోటీల్లో 6 మ్యాచ్‌లు ఆడి 19 వికెట్లు తీయడంతోపాటు 265 పరుగులు సాధించి ఉత్తమ ఆల్‌రౌండర్‌గా గుర్తింపు పొందాడు.
- అంతర్ రాష్ట్ర అండర్–25 వన్డే క్రికెట్ టోర్నీలో హైదరాబాద్‌పై జరిగిన మ్యాచ్‌లో 4.4 ఓవర్లలో కేవలం 14 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టి సెలెక్టర్లను ఆకర్షించాడు.
- 2021–22లో అంతర్రాష్ట్ర అండర్–23 క్రికెట్ టోర్నీలో మెరుగ్గా రాణించడంతో బీసీసీఐ నిర్వహిస్తున్న బెంగళూరు నేషనల్ క్రికెట్ అకాడమీకి ఎంపికై శిక్షణ పొందారు.
- ఆంధ్ర ప్రీమియం లీగ్(ఏపీఎల్) టీ–20 క్రికెట్ పోటీల్లో మూడు సీజన్లలోనూ రాణించాడు. రాయలసీమ కింగ్స్‌పై జరిగిన మ్యాచ్‌లో 25 బంతుల్లో 63 పరుగులు సాధించి అజేయంగా నిలిచి విశేషంగా ఆకట్టుకున్నాడు.



బౌలింగ్‌లోను సత్తాచాచడంతో ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డును అందుకున్నారు.

- ఏపీఎల్ టీ–20 క్రికెట్ మ్యాచ్‌ల్లో బెస్ట్ ఫీల్డర్‌గా మరో రూ.50వేల నగదు బహుమతిని ప్రస్తుత బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ చేతులమీదుగా అందుకున్నాడు.
- గత సీజన్‌లో నాగ్‌పూర్‌లో జరిగిన విదర్భపై తన మొదటి మ్యాచ్‌లోనే నాలుగు కీలక వికెట్లు పడగొట్టాడు. తాజాగా హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీశాడు.

ఎయిర్‌పోర్టు నిర్మాణానికి వ్యతిరేకంగా పర్యటన



గ్రామాల్లో పర్యటిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పలాస: ప్రజల జీవనాధారమైన ఉద్దానం జీడి తోటల మధ్య ఎయిర్ పోర్టు నిర్మాణం చేయాలన్న ఆలోచనను నిలుపుదల చేయాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పలాస నియోజకవర్గంలోని ఉద్దానం ప్రాంతంలోని గ్రామాల్లో సోమవారం పర్యటించారు. ప్రజలను కలసి ఎయిర్‌పోర్టు నిర్మాణం వల్ల తలెత్తిన సమస్యలను వివరించారు. ఎయిర్ పోర్టు నిర్మాణ వ్యతిరేక పోరాట కమిటీలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మొత్తం 20 గ్రామాల పరిధిలో గ్రీన్‌ఫీల్డ్ కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపట్టడం వల్ల రైతులకు చాలా నష్టం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు గొరకల బాలకృష్ణ, ప్రగతి శీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు పోతనపల్లి కుసుమ, కుత్తుం హేమక్క, జానకమ్మ, యువజన నాయకులు సార జగన్, రాపాక మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

పోర్టు నిర్వాసితుల వాగ్వాదం



టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో నిర్వాసితుల వాగ్వాదం

టెక్కలి: టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో మూలపేట పోర్టు నిర్వాసితులు సోమవారం వాగ్వాదానికి దిగారు. పోర్టు నిర్మాణంలో భాగంగా గతంలో సేకరించిన భూముల వివరాలకు సంబంధించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రీసర్వే చేపట్టారు. ఈ రీసర్వేలో నిర్వాసితులకు నోటీసులు జారీ చేశారు. నోటీసుల ప్రాప్తికి కార్యాలయంలో అధికారులు మరోసారి వివరాలను పరిశీలించే ప్రక్రియ చేపడుతున్నారు. అయితే భూముల వివరాల గల్లంతు విషయంలో నిర్వాసితుల మధ్య వాగ్వాదం తలెత్తడంతో కార్యాలయం ఆవరణలో గందరగోళం చోటు చేసుకుంది.

కలెక్టర్ గ్రీవెన్స్‌కు 65 అర్జీలు

మీకోసంలో నమోదైన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో కలెక్టర్‌తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లతో కలసి అర్జీలు స్వీకరించారు. మొత్తం 65 అర్జీలు అందాయి. అర్జీల స్వీకరణలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ కిరణ్ కుమార్, జెడ్పీ సీఈఓ ఎల్ఎన్‌వీ శ్రీధర్ రాజ ఉన్నారు.

-శ్రీకాకుళం పాతబస్టాండ్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఎస్పీ గ్రీవెన్స్‌కు 60 ఫిర్యాదులు



అర్జీదారుల వద్దకు వచ్చి సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం పరిష్కార వేదిక (ఎస్పీ గ్రీవెన్స్)లో అర్జీదారుల నుంచి 60 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అర్జీలను స్వీకరించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

-శ్రీకాకుళం క్రైమ్

క్లుప్తంగా

కొండచిలువ కలకలం



హతమైన కొండచిలువ

కంచిలి: మండలంలోని మకరాంపురం గ్రామంలో లింగాల చెరువు వద్ద సోమవారం సాయంత్రం 12 అడుగుల పొడవు ఉన్నటువంటి కొండచిలువ కలకలం సృష్టించింది. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఆ మార్గంలో వెళ్తున్న వారు కొండచిలువను హతమార్చినట్లు తెలిసింది.

పూరిల్లు దగ్ధం

రణస్థలం: మండలంలోని దేరసాం గ్రామంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో కోరాడ మహాలక్ష్మికి చెందిన పూరిల్లు దగ్ధమైంది. ఇంటిలో గ్యాస్ లీకై పేలడంతో మొత్తం ఇల్లు అగ్నికి ఆహుతైంది. అగ్నిమాపక సిబ్బంది పూర్తిగా మంటలు అదుపు చేసి, గ్యాస్ సిలెండర్‌ను బయటకు తీశారు. ఈ ప్రమాదంలో రూ.50,000 నగదు, ఆర తులం బంగారం, పలు ధ్రువపత్రాలు, ఎలక్ట్రికల్ వస్తువులు కాలిపోయాయి.

ఆశలు సమాధి చేస్తూ..!



- పింఛన్లపై కూటమి కుట్రలు
- నవంబర్ తర్వాత మరణించిన కుటుంబాలకే పింఛన్
- అంతకుముందు వారికి మొండిచేయి
- కొత్త పింఛన్ల నమోదుకు వెసులుబాటు లేదు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వారికి కూటమి ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ఏ ఆర్థిక స్తోమత లేకుండా ఉన్న వృద్ధులు, వితంతువులకు చుక్కలు చూపిస్తోంది. పక్షపాత ధోరణితో సర్క్యులర్ విడుదల చేసి కొంతమందికే ప్రయోజనం చేకూరేవిధంగా వ్యవహరిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు ఐదు నెలలు పూర్తి కావస్తున్నా, ఇంతవరకు రాష్ట్రంలో ఒక్క కొత్త పింఛన్ కూడా మంజూరు చేయలేదు. పైగా చాపకింద నీరులా ప్రతినెలా పింఛన్లు తగ్గించుకొస్తోంది. పింఛన్ మొత్తం పెంచామని సంబరాలు చేసిన కూటమి ప్రభుత్వం, కొత్తవారికి ఎందుకు పింఛన్లు ఇవ్వడం లేదో సమాధానం చెప్పడం లేదు. అంతేకాకుండా ఎన్నికల హామీల్లో 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామన్న హామీ నేటి వరకు నెరవేర్చలేదు. ఆ మాట ఎక్కడా ఈ ప్రభుత్వం ప్రస్తావన కూడా తీసుకురాకపోవడం గమనార్హం.

సర్క్యులర్ విడుదల

తాజాగా ఈనెల 22న రాష్ట్ర ప్రభుత్వం ఒక సర్క్యులర్‌ను విడుదల చేసింది. దీని ప్రకారం నవంబర్ ఒకటి నుంచి డిసెంబర్ ఒకటో తేదీ వరకు పింఛనుదారు మరణించి ఉంటే వారి కటుంబంలో వారికి విడో పింఛన్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అంటే ఈ సర్క్యులర్‌తో ఒక నెలలో పింఛను ఉన్న భర్తను కోల్పోయినవారికి మాత్రమే వితంతు పింఛను ఇవ్వనున్నారు. అంటే అంతకుముందు జనవరి నుంచి పింఛన్ పొందుతున్న భర్తను కోల్పోయిన వితంతువులకు పింఛను మంజూరు అవ్వదు. అంతేకాకుండా వారు పింఛను కోసం దరఖాస్తు చేసుకొనే వెసులుబాటు కూడా కల్పించలేదు.

గత పరిస్థితులు గుర్తొచ్చేలా..

గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కొత్త వారికి అంటే వితంతువు, వికలాంగుడు, వృద్ధులు ఎవరికైనా పింఛన్ కావాలంటే అష్టకష్టాలు పడాల్సి వచ్చేంది. అర్హులందరికీ పింఛన్ ఇచ్చేవారు కాదు. ఆ గ్రామంలో ఒక పింఛన్‌దారు మరణిస్తే, ఆ స్థానంలో మరొకరికి పింఛన్ అందజేసేవారు. గ్రామ జనాభా ప్రాతిపదికన పింఛన్లకి సీలింగ్ ఉండేది. దీంతో కొత్త పింఛన్ పొందాలనుకునేవారు ఎవరైనా పింఛనుదారు మరణిస్తారా అని ఎదురు చూసేవారు. మరలా ప్రస్తుతం అటువంటి పరిస్థితులు కనిపిస్తున్నాయని వాపోతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ నిష్పక్షపాతంగా పింఛన్లు అందజేసేవారు. అర్హత ఉంటే ఎటువంటి సిపార్సులు లేకుండా పింఛను కోసం దరఖాస్తును సైతం వాలంటీర్లే పెట్టేవారు. అనంతరం మంజూరైన పింఛన్‌ను ఇంటి వద్దకే తెచ్చి అందజేసేవారు. కానీ కూటమి ప్రభుత్వం కొత్త పింఛన్లు ఇవ్వకపోగా, ఉన్నవాటిని తొలగిస్తోందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చేనాటికి జిల్లాలో అన్ని రకాల పింఛన్లు 3,24,316 ఉండేవి, అవి నవంబర్ నాటికి 3,15,630కి చేరాయి.

అటకెక్కిన హామీ

50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ హామీని ఎన్నికల సమయంలో కూటమి నేతలు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తయినా కొత్త పింఛన్లు కోసం ఎటువంటి చర్యలు లేవు, కాగా ఈ హామీపై పాలకులు కనీసం స్పందించడం లేదు. మన జిల్లాలో 50 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారు 3,05,537 మంది ఉన్నారు. వివిధ కారణాల వలన అంటే ఉద్యోగం, ఇన్‌కంటాక్సు, ఇతర ఆదాయ వనరులు ఉన్నవారు వీరిలో 30 శాతం ఉన్నా, మిగిలిన 70 శాతం మందికి పింఛన్ ఇవ్వాల్సింది. అంటే సుమారుగా 2,22,000 మందికి కొత్త పింఛను అందజేయాల్సింది. దీంతో వీరంతా ప్రస్తుతం సచివాలయాలు, ఎంపీడీవో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే ఇంకా మార్గదర్శకాలు రాలేదని ఉద్యోగులు వెనక్కి పంపిస్తున్నారు.

దాడి చేశాడని ఫిర్యాదు



సీసీ ఫుటేజీ చిత్రాలు

శ్రీకాకుళం క్రైమ్ : మద్యం మత్తులో ఓ విలేకరి తనపై దాడి చేశాడని శ్రీకాకుళం దమ్మలవీధికి చెందిన ఓ కారుడ్రైవర్ ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడని ఎస్ఐ ఎం.హరికృష్ణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. దమ్మలవీధికి చెందిన సూరాడ సత్యం (46) కారుడ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఆదివారం రాత్రి 8:45 గంటల ప్రాంతంలో విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి బయల్దేరారు. గోల్కొండ రేవు రోడ్డు తాలాడ రవి ఇంటి వద్దకు వచ్చే సరికి అక్కడ రోడ్డుకు అడ్డంగా పవన్ (విలేకరి) అనే వ్యక్తి కారు ఉంది. రోడ్డు మధ్యలో కారు ఎందుకు పెట్టారని ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో పవన్ తనపై దాడి చేశాడని సూరాడ సత్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పవన్ కూడా తనపై దాడి జరిగిందని సత్యంపై ఫిర్యాదు చేశారు. ఈ విషయమై మాట్లాడేందుకు ఆదివారం రాత్రి ఎమ్మెల్యే గొండు శంకర్ స్టేషన్‌కు రావడం చర్చనీయాంశమైంది. దాడి దృశ్యాలు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. ఈ విషయం ఎస్పీ దృష్టికి వెళ్లడంతో డీఎస్పీ వివేకానందను మొత్తం అంశాన్ని పర్యవేక్షించి నివేదిక ఇవ్వమని సూచించారు. పవన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.హరికృష్ణ తెలిపారు.

కిడ్నీరోగులకు అండగా ఉందాం



జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉద్దానం ప్రాంతంలో పెరుగుతున్న కిడ్నీ బాధితులను నిరంతరం పర్యవేక్షించి వారి రోగాన్ని కుదుటపరిచేలా చేసే బాధ్యత మనందరికీ ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా అని తెలిపారు.

ఉద్దానం కిడ్నీ రీసెర్చ్ సెంటర్ వైద్యులు, పారిశ్రామిక సంస్థల ప్రతినిధులతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. కిడ్నీ వ్యాధి నిర్మూలనకు అన్ని వర్గాలు, ప్రభుత్వ రంగ సంస్థలు కలిసి పని చేయాలని సూచించారు.

ఉద్దానం కమిటీలో ఉన్న వైద్యులు, నెఫ్రాలజిస్టులు, సైకాలజిస్టులు, ఫ్యాక్టరీస్ డిపార్టుమెంట్ కలిసి ప్రత్యేకంగా కిడ్నీ వ్యాధిగ్రస్తులపై దృష్టి పెట్టాలని కోరారు.

జోనల్ చైర్మన్‌గా దొన్నుదొర



ప్రమాణ స్వీకారం చేస్తున్న దొన్నుదొర

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ విజయనగరం జోన్-1 జోనల్ చైర్మన్‌గా సియ్యారి దొన్నుదొర సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. విజయనగరంలోని ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో ఉన్న చైర్మన్ ఛాంబర్‌లో సోమవారం ఉదయం 10.30 గంటలకు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఆర్టీసీ అధికారులు హాజరయ్యారు. అనంతరం శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోలకు సంబంధించి రెండు నూతన అల్ట్రా డీలక్స్ బస్సులు, ఒక ఎక్స్‌ప్రెస్ బస్సును ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీపీటీవో ఎ.విజయ్‌కుమార్, ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కేఆర్ఎస్ శర్మ, ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యం



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా బోధన కొనసాగాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషి చేయాలన్నారు. నిర్ణీత గడువులోగా సిలబస్ పూర్తిచేసి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు. చదువుతో పాటు విద్యార్థుల నడవడికపై కూడా అధ్యాపకులు దృష్టి సారించాలన్నారు. చెడు వ్యసనాల బారిన పడకుండా, వ్యక్తిత్వ వికాసం పెంపొందేలా శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెరిగితే అడ్మిషన్ల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంటుందని చెప్పారు. కళాశాలల్లో మధ్యాహ్న భోజనం, మంచినీరు, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. సమీక్షకు జిల్లాలోని 38 ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి(డీఐఈవో) ఎస్.తవిటినాయుడు, ఆర్ఐవో పి.దుర్గారావు, ఆర్టీసీ డీఎం శర్మ హాజరయ్యారు.

విద్యతో సామాజిక అంతరాల తగ్గింపు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

కాశీబుగ్గ: సమాజంలో వివిధ రకాల రుగ్మతల్ని తగ్గించి సామాజిక అంతరాలు రూపుమాపి సమానత్వం ఆలోచనను పెంపొందించే లక్షణం విద్యకు మాత్రమే ఉందని, ఇలాంటి విద్య ప్రభుత్వ రంగంలో మాత్రమే ఉండాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు కోరారు. శ్రీకాకుళం జిల్లా యూటీఎఫ్ జిల్లా మహాసభలు మందస మండలం హరిపురం ఉన్నత పాఠశాలలో సోమవారం ముగిశాయి. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజంలో నైతిక విలువలు బలహీనంగా ఉండటానికి కారణం విద్య సగభాగం ప్రైవేటీకరణ కావడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యతో సమాజానికి మానవత్వం కలిగిన నూతన తరం తయారుకావాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయుల సంక్షేమం విద్యారంగ వికాసం లక్ష్యాలుగా యూటీఎఫ్ పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు ఎస్.మురళీమోహన్, కిశోర్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ మూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర, ఆఫీస్ బేరర్స్ వైకుంఠరావు, దాలయ్య, ధనలక్ష్మి, రవికుమార్, రమేష్, కోదండరావు తదితరులు పాల్గొన్నారు.



జై భీమ్..

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుందామని పాతపట్నం ప్రభుత్వ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కేవీ రత్నకుమారి అన్నారు. సోమవారం పాతపట్నం ప్రభుత్వ మోడల్ స్కూల్ విద్యార్థులు 'జై భీమ్' అక్షరాకృతిలో కూర్చుని ఆకట్టుకున్నారు.

– పాతపట్నం

వివాహిత అనుమానాస్పద మృతి

- అత్తింటివారే చంపేశారని ఆరోపణ



ఇంట్లో మంచంపై విగతజీవిగా పడివున్న నీరజాక్షి (ఇన్‌సెట్లో) నీరజాక్షి (ఫైల్)

కాశీబుగ్గ: పలాస మండలం కేదారిపురం పంచాయతీ ఈదురాపల్లి గ్రామంలో పైల నీరజాక్షి (24) అనే వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందింది. అయితే తమ కుమార్తెను చంపేశారని మెళియాపుట్టి మండలం టకోయి గ్రామానికి చెందిన నీరజాక్షికి తండ్రి సంపతిరావు ఆరోపించడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని, మృతురాలి భర్త పైల జయరాం అలియాస్ వినోద్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇండియన్ ఆర్మీలో ఉద్యోగం చేస్తూ సెలవుపై పదిహేను రోజులు క్రితం జయరాం ఇంటికి వచ్చారు. వీరికి ఈ ఏడాది ఏప్రిల్ 3వ తేదీన వివాహం జరిగింది. ఆదివారం రాత్రి నీరజాక్షి ఫోన్ చేసి తనను అత్తవారింట్లో ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పిందని మృతురాలి తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. తన కూతురు మరణించేంత పిరికిది కాదని ఆమెను ఆడపడుచూ, భర్త కలిసి చంపేశారని ఆవేదన చెందారు. మరణానికి కారణమైనవారిని కఠినంగా శిక్షించాలని కోరారు. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం

- మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి: రానున్న రోజుల్లో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వ్యవసాయశాఖా మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని నిమ్మాడలో ఉన్న మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు సోమవారం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, అలాగే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తొలి ప్రాధాన్యత ఇస్తామన్నారు.


ఆలయాల హుండీలు చోరీ



చోరీకి గురైన మందలమ్మ తల్లి ఆలయం

సరుబుజ్జిలి: మండలంలోని పురుషోత్తపురం గ్రామ మందలమ్మ తల్లి, సంతోషిమాత ఆలయాల్లో ఆదివారం అర్ధరాత్రి దొంగలుపడ్డారు. మందలమ్మ తల్లి ఆలయంలో ఉన్న బీరువా, హుండీ , సీసీ కెమెరాలు పగులగొట్టి పట్టుకుపోయారు. హుండీలో ఉన్న కొంత నగదు, అమ్మవారికి సమర్పించిన మంగళసూత్రాలు దొంగలించుకుపోయారు. సంతోషమాత ఆలయంలో కూడా కొంత నగదు చోరీకి గురయినట్లు నిర్వాహకులు తెలిపారు.

సహాధ్యక్షుడిగా నెమలపురి



నెమలపురి విష్ణుమూర్తి

వజ్రపుకొత్తూరు: ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా సహాధ్యక్షుడిగా నెమలపురి విష్ణుమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీఎస్‌టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చందనరావు నుంచి ఉత్తర్వులు అందినట్లు విష్ణుమూర్తి సోమవారం తెలిపారు. ఈయన వజ్రపుకొత్తూరు మండల పల్లిసారధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా విష్ణుమూర్తి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలపై చిత్తశుద్ధితో పని చేస్తామని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, విద్యార్థుల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా పని చేస్తానన్నారు. ఈయన ఎన్నికపై చిన్నబాబు, ఎస్.మల్లేసు, గోవిందరాజులు, ఎన్.సురేష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

పశువుల అక్రమ రవాణా అడ్డగింత

- 15 మంది అరెస్టు



కంటైనర్‌లో తరలిస్తున్న పశువులు

నరసన్నపేట: జాతీయ రహదారిపై పశువుల అక్రమ రవాణాను పోలీసులు అడ్డుకున్నారు. మండలంలోని మడపాం టోల్‌గేట్ వద్ద వివిధ వాహనాల్లో తరలిస్తున్న 74 పశువులను పట్టుకున్నారు. వీటిని కొత్తవలస గోశాలకు తరలించారు. ఐదు బొలేరో లగేజీ వాహనాలతో పాటు ఒక కంటైనర్‌లో పశువులను తరలిస్తున్నట్లు ముందస్తు సమాచారం రావడంతో శ్రీకాకుళం టాస్క్‌ఫోర్సు పోలీసులు సోమవారం వేకువజామునే కాపుకాశారు. దీనిలో భాగంగా వచ్చిన వాహనాలను తనిఖీ చేశారు. కంటైనర్‌లో 40 పశువులు, ఐదు బొలేరో వాహనాల్లో 34 పశువులు గుర్తించారు. వీటిని నరసన్నపేట పోలీసులకు అప్పగించారు. దీనిపై కేసు నమోదు చేశామని, వాహనాల్లో ఉన్న 15 మందిని అరెస్టు చేశామని ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.